

ష్..

- మూగబోయిన ఎన్నికల మైకులు
- ఓటర్లకు ప్రలోభాల ఎరలో అభ్యర్థులు
- పోల్ మేనేజ్‌మెంట్‌పై రాజకీయ పార్టీల దృష్టి

ముగిసిన ప్రచారం

గుంటూరు, బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రచారం పరిసమాప్తమైంది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు శనివారం సాయంత్రం 6 గంటలకు నిషేధాజ్ఞలు అమల్లోకి వచ్చాయి. కాగా చివరి రోజున ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ర్యాలీలు, రోడ్ షోలు, సభలతో హోరెత్తించి ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికారు. దీంతో ఎన్నికల మైకులు మూగబోయాయి. దాదాపు రెండు నెలలుగా ప్రచార హోరుతో దద్దరిల్లిన గ్రామాలు, పట్టణాలన్నీ ఒక్కసారిగా సైలెంట్ అయిపోయాయి. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకోవడానికి చివరి ప్రయత్నంగా శనివారం సాయంత్రం వరకు ఉన్న అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఇంతకాలం ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి మండుటెండల్లో ప్రచారం చేసిన నేతలు రహస్య మంతనాలు, ప్రలోభాలపై దృష్టిసారించేందుకు ప్రణాళికలు రూపొందించుకుని రంగంలోకి దిగారు. పోలింగ్‌కు కొద్ది గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున బూత్‌ల వారీగా బలాబలాలపై మరోమారు సమీక్ష జరుపుకునే పనిని ఆదివారం నేతలు చేయనున్నారు. ప్రతికూలంగా ఉన్న చోట్ల రహస్యమంతనాలు జరపడానికి ప్రణాళికలు రచించి దానికి అనుగుణంగా అడుగులు వేయనున్నారు. ప్రచార గడువు ముగియడంతో జెండాలు, కండువాలు లేకుండా గ్రామాల్లో, పట్టణాల్లో నేతలతో పాటు వారి అనుచరులు తిరగడానికి ప్రణాళికలు రచించారు. రాత్రివేళల్లో ఓటరు స్లిప్పుతో పాటు ఓటుకు రేటుతో నగదు పంపిణీని నేతల అనుచరులు పంచుతున్నారు. ఓటుకు రూ.1,500 నుంచి 2,000 వరకు ఇస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను ముమ్మరంగా చేశారు. మద్యం దుకాణాలకు సాయంత్రం 6 గంటల నుంచి ఎక్సైజ్ అధికారులు సీలు వేశారు.

సుదీర్ఘంగా ఎన్నికల ప్రక్రియ

ఈ దఫా ఎన్నికల ప్రచారం సుదీర్ఘంగా సాగింది. షెడ్యూల్ మార్చి 16న విడుదల కాగా నోటిఫికేషన్ నెలా రెండు రోజుల తర్వాత ఏప్రిల్ 18న విడుదలైంది. అప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. గత ఎన్నికల్లో తొలి విడతలోనే పోలింగ్ జరగ్గా ఈ దఫా నాల్గో దశలో జరగబోతున్నాయి. రాజకీయ పార్టీలకు ఎక్కువ సమయం లభించడంతో నియోజకవర్గాల వారీగా సభలు, రోడ్ షోలను పార్టీల అధ్యక్షులు నిర్వహించారు. దాదాపుగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలల్లో ఏదో ఒక రూపంలో ప్రచారం చేశారు. ఎన్‌డీఏ కూటమి తరపున ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తది తరులు తొలి అడుగు చిలకలూరిపేట నియోజకవర్గంలోని బొప్పూడి ఆంజనేయస్వామి పాదాల చెంత నుంచి ప్రచారం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రచార సభలు, రోడ్ షోలతో ప్రధాన పార్టీల నాయకులు హోరెత్తించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రజాగళం పేరుతో బహిరంగ సభలు నిర్వహించారు. గుంటూరులో చంద్ర బాబు రోడ్ షోకు వేలాదిగా ప్రజలు హాజరై మద్దతు తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెనాలి, పొన్నూరుల్లో ప్రచార సభలు, రోడ్‌షోలు నిర్వహించి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను చైతన్య పరిచారు. కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ షర్మిల గుంటూరు, బాపట్ల, చీరాల, రేపల్లెలో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించారు. కాగా అధికార యంత్రాంగం రెండు నెలలపై నుంచి ఎన్నికల నిర్వహణ పైనే పూర్తిగా నిమగ్నమైంది. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా కొంత సమస్యలు ఎదురైనప్పటికీ గడువుని పెంచి అందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చేశారు. ఈఎన్నికల్లో ప్రప్రథమంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌ని సజావుగా నిర్వహించారు.



సంక్షేమ బాదుడు

- సామాన్యుడిపై ధరా భారం
- పథకాల మాటున రెట్టింపు దోపిడి
- ధరలు అదుపులో వైసీపీ ప్రభుత్వం విఫలం
- ఐదేళ్లలో 200 నుంచి 300 శాతం పెరిగిన ధరలు
- ఐదేళ్లలో కుటుంబానికి 3 లక్షల వరకు అదనపు ఖర్చు
- మందుబాబులుంటే ఆ భారం మరో రూ.2 లక్షలు అదనం

సంక్షేమం అన్నారు.. ప్రతీ ఇంటా ఏదో ఒక లబ్ధి పొందారన్నారు.. కానీ పథకాల ద్వారా ఒక్కో కుటుంబం పొందిన లబ్ధి కంటే వారిపై బాదుడు భారం పది రెట్లకు పైగా పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సామాన్యుడి ఇంట ధరల మంట అంటుకుంది. ధరల రూపంలో, ఛార్జీల రూపంలో ప్రతీ కుటుంబం ఐదేళ్లు విలవిలలాడిపోయింది. కరెంటు బిల్లులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇక చెత్త పన్నుతో పాటు ఇంటి పన్నులు పెరుగుదలతో అద్దెలు కూడా పెరిగాయి. ధరా భారం, చార్జీలు, పన్నుల మోతలతో కుటుంబాలు చితికిపోయాయి. ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని, కోల్పోయిన ఆదాయాన్ని చూసుకుని ఘొల్లుమంటున్నాడు. పెరిగిపోతోన్న ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విస్మరించింది. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలను ఇష్టం వచ్చినట్లుగా పెంచేశారు. అసలు ధరలు ఎందుకు పెరుగుతున్నాయంటే సమాధానం చెప్పేవారే లేకుండా పోయారు. వ్యాపారుల తీరు ఈ విధంగా ఉంటే.. ప్రభుత్వం చార్జీలు, పన్నుల బాధుడుతో చెలరేగిపోయింది. మొత్తంమీద ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో అరకొర విదిల్చి పెద్దమొత్తంలో దోచుకుందని ప్రజలు వాపోతున్నారు.

గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం.. సంక్షేమం.. అంటూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం జపం చేస్తూ వచ్చింది. అయితే సంక్షేమం రూపంలో అందిన మొత్తాలకంటే తమ నుంచి వివిధ రూపాల్లో దోచుకున్నదే అధికం అని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమం కంటే ఒక్కో కుటుంబంపై అంతకు రెండు రెట్లు భారం పడింది. ఈ విషయం గమనించిన ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో సంక్షేమంపై ఊకదంపుడు ఉపన్యాసాలతో హోరెత్తించింది. అయితే ధరలు, చార్జీలు, పన్నుల రూపంలో తమపై పడిన భారాన్ని తలుచుకుని ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలకు రెక్కలు వచ్చాయి. నాటి నుంచి ఇప్పటి వరకూ నిత్యావసర ధరల్లో పెరుగుదల 200 నుంచి 300 శాతం ఉంది. 2019లో రూ.40 ఉన్న కిలో సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.65 నుంచి 70కి పెరిగింది. రూ.50 ఉన్న కిలో కందిపప్పు ధర ఇప్పుడు 160కి పెరిగింది. రూ.50 ఉన్న కిలో పామాయిల్ రూ.155కి పెరిగి ఇప్పుడు రూ.98కి తగ్గింది. రూ.40 ఉన్న లీటరు పాల ధర ఇప్పుడు రూ.70కి చేరింది. కిలో చికెన్ రూ.150 నుంచి రూ.300కు, రూ.350 ఉండే మటన్ రూ.850కు పెరిగింది. పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో పెట్రోలు ధర లీటరుకు రూ.10 అదనం కావడంతో భారం మరింత పెరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే నిత్యావసర ధరలు సామాన్యుడి నడ్డి విరిచేస్తున్నాయి.

మందుబాబుల కుటుంబమైతే..

గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో క్వార్టరు మద్యం ధర రూ.50 నుంచి 60 ఉండేది. వైసీపీ ప్రభుత్వం మద్య నిషేధం పేరుతో మద్యం ధరను రూ.200కు పెంచింది. ఫలితంగా ఒక్కో మందుబాబుపై కనీసంగా రూ.140 భారం పడింది. ఆ కారణంగా ఆయా కుటుంబాలపై నెలకు రూ.4,200 భారం అదనంగా పడింది. ఏడాదికి రూ.50,400, ఐదేళ్లకు రూ.2లక్షల 52 వేలు అదనంగా భారం పడింది. అంటే ఒక్కో మందుబాబు కుటుంబంపై కనిపించకుండా రెండున్నర లక్షల భారం పెరిగింది. దీనికి తోడు ఇంటి పన్ను, చెత్తపన్ను, ఆర్టీసీ చార్జీలను కలుపుకుంటే ఆ భారం మరింత పెరిగినట్లే.

ధరల స్థిరీకరణపై నిర్లక్ష్యం

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలను స్థిరీకరిస్తామని, అందుకోసం రూ.3 వేల కోట్లతో నిధిని బడ్జెట్లో కేటాయిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. చెప్పినట్లుగా బడ్జెట్లో నిధులు కేటాయించినట్లు చూపించిన ప్రభుత్వం ఆచరణలో దాన్ని పక్కన పెట్టేసింది. ఫలితంగా ధరల భారం ప్రజలపై దారుణంగా పడింది. కందిపప్పు, బియ్యం ధరలు పెరిగినప్పుడు ఆర్భాటపు ప్రకటనలు చేసిన ప్రభుత్వం సబ్సిడీ ధరలకు వాటిని ఇవ్వలేదు. దీంతో ఆ భారమంతా ప్రజలే మోయాల్సి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ధరలు పెరిగిన సందర్భాల్లో రైతుబజార్ల ద్వారా, రేషన్ షాపుల ద్వారా సబ్సిడీ ధరలకు వాటిని అందించింది. ఫలితంగా సామాన్యులకు కొంత ఊరట లభించేంది. వైసీపీ వచ్చాక ఆ ఊసే లేకుండా పోయింది.

రూ.1.96 లక్షలు ఇచ్చి రూ.3.60 దోపిడీ

ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వార ఒక్కో కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకూ ప్రయోజనం చేకూరినట్లు వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. 4 దఫాల అమ్మఒడి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.54 వేలు, 3 దఫాల చేయూత ద్వారా రూ.55 వేలు, రుణ మాఫీ ద్వారా రూ.40 నుంచి రూ.60 వేలు, పింఛన్ల పెంపుదల ద్వారా రూ.27 వేలు లబ్ధి చేకూరింది. అంటే ఒక కుటుంబంలో ప్రభుత్వ పథకాలన్నీ పొందినా అది రూ.1.96 లక్షలు అందుకున్నట్లు. కానీ ధర పెరుగుదల కారణంగా అదే కుటుంబంపై నెలకు రూ.4 నుంచి 6 వేలు చొప్పున ఏడాదికి 48 నుంచి 72 వేలు ఐదేళ్లకు 2 లక్షల 40 వేల నుంచి రూ.3 లక్షల 60 వేల వరకూ భారం పడినట్లు. అంటే సంక్షేమ పథకాల పేరుతో రూ.1.96 లక్షలు ఇచ్చి అదనంగా 2 లక్షల వరకు దోచుకున్నట్లే.

నెలకు రూ.6 వేల భారం

వైసీపీ అధికారంలోకి వచ్చాక లెక్కలు తీస్తే ఒక్కో కుటుంబంపై రూ.4 నుంచి 6 వేల వరకు భారం పడుతున్నట్లు తేలింది. 25 కేజీల బియ్యం కట్టపైనే ఒక్కో కుటుంబం నెలకు రూ.650 అదనంగా చెల్లించాల్సి వస్తోంది. గతంలో రూ.వెయ్యి ఉన్న బియ్యం కట్ట ఇప్పుడు రూ.1650 వరకూ విక్ర యిస్తున్నారు. కంది పప్పుపై ఒక్కో కుటుంబం నెలకు రూ.500, నూనెలపై రూ.400, పాలపై రూ.900 వందలు, గ్యాసుపై రూ.500, చింతపండు, ఉల్లిపాయలపై రూ.300, అల్లం, వెల్లుల్లిపై రెండు వందలు, చికెన్‌పై రూ.400, మటన్‌పై 800 నుంచి రూ.1200 అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. చంద్ర బాబు పాలనలో రూ.300 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.1100 నుంచి 1400 వస్తోంది. రోజుకు ఒక లీటరు పెట్రోల్ వాడే కుటుంబంపై నెలకు రూ.900 భారం పడింది. ఈ మొత్తం కలుపుకుంటే ఒక్కో కుటుంబంపై ప్రతి నెలా 4 నుంచి 6 వేల వరకూ ఖర్చు పెరిగింది.

- ఓటేయడానికి భారీ సంఖ్యలో రాక
- వైసీపీలో కలవరం.. రవాణాలో ఆటంకాలు



ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వాహనాల్లో ఆంధ్రాకు తరలివస్తున్న ప్రజలు

ఉత్సాహంతో.. ఊర్లకు..

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), గుంటూరు, మే 11: పండుగలకు.. జాతర్లకు వచ్చినట్లుగా ఓటర్లు ఉత్సాహంగా ఊర్లకు తరలివస్తున్నారు. గతంలో ఎన్నో ఎన్నికలు జరిగాయి. కానీ ఆ.. చూద్దాంలే.. కుదిరితే వద్దాంలే.. ఎవరైనా ఖర్చులు పెట్టుకుంటే వస్తాం అన్నట్లుగా ఓటర్లు ఉండేవారు. కానీ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో కసిగా ఓటర్లు పెద్దసంఖ్యలో సొంతూళ్లకు తరలివస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉంటున్న వేలాది మంది తమతమ సొంతూళ్లకు తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరైతే శనివారమే పయనమవగా మిగిలిన వారు ఆదివారం వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. విదేశాల నుంచి కూడా పెద్దసంఖ్యలో ఈ సారి ఓటు వేయడానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మొదలుకుని వివిధ రంగాలలో స్థిరపడిన వారు, కార్మికులు, విద్యార్థులు ఇలా అందరూ ఎలాగైనా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే కసితో సొంతూళ్ల బాట పట్టడం రాజకీయ పండితులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఓటు వేయడానికి ఆసక్తి చూపిన దాఖలాలు లేవని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పైగా వరుస సెలవులు వస్తే ఆటవిడుపుగా భావించే వారని కానీ ఈ సారి పరిస్థితి మారిందంటున్నారు. కసితోనే వస్తున్నారన్న అంచనాలతో అధికారపార్టీ నేతల్లో కల వరం మొదలైంది. దీంతో రవాణా విషయంలో ఆటంకాలు కలిగించడానికి వైసీపీ కుట్రలు పన్నుతోందన్న విమర్శలను టీడీపీ చేస్తోంది. నిన్నమొన్నటి వరకు ఆయా పార్టీల అభ్యర్థులు ఏర్పాటు చేసే రవాణా సౌకర్యం మీద ఆశలు పెట్టుకున్న ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్లు, ఇప్పుడు ఎవరికి వారు స్వచ్ఛందంగానే వచ్చేలా సిద్ధమయ్యారు. శనివారం గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ప్రయాణీకుల కోలాహలం నెలకొన్నది. అంతేగాక కొందరు గ్రూపులుగా ఏర్పడి సొంతంగా కార్లను కూడా ఏర్పాటు చేసుకొని మరీ ఓటు వేసేందుకు ఉత్సాహంగా చూపుతున్నారు. దీంతో టోల్ ప్లాజాల వద్ద కార్లతో రద్దీ ఏర్పడింది.

50 వేల మందికిపైగా రాక..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ అంచనా ప్రకారం దాదాపు 50,000 మంది వేరే ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా స్వస్థలాలకు తరలి వస్తున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో చూస్తే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లలో పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారు. తర్వాత స్థానాల్లో బాపట్ల, వేమూరు, రేపల్లె, అద్దంకి, చీరాల ఉన్నాయి. ఇప్పటికే హైదరాబాద్ నుంచి గుంటూరుకు వచ్చే రైళ్లని కిటకిటలాడుతూ వస్తున్నాయి. బస్సుల్లో సైతం అదే రద్దీ నెలకొంది. ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసినా అన్నింట్లోనూ సీట్లు దొరకని పరిస్థితి. 500 మంది వరకు విదేశాల నుంచి ఓటు వెయ్యడానికి రావొచ్చని తెలుస్తోంది. ఈ స్థాయిలో ప్రవాస ఓటర్లలో స్పందన కనిపించడంపై టీడీపీ ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలు తమకు సానుకూలమని, ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంటేనే ఈ విధంగా ఓటర్లు సొంతూళ్ల బాట పడతారని టీడీపీ అభ్యర్థులు లెక్కలు వేస్తుకుంటున్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఓటింగ్‌లో ఉద్యోగులు దాదాపు కూటమి వైపు మొగ్గారనే అంచనాల నుంచి తేరుకోకముందే ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లు భారీగా తరలి రావడంతో వైసీపీ నేతలు కలవర పడుతున్నారు.

ప్రత్యేక రైళ్లు ఏర్పాటు

హైదరాబాద్‌లో నివసిస్తూ ఓటు వేయడానికి గుంటూరు, పల్నాడు జిల్లాలకు వస్తున్న వారి కోసం రైల్వే శాఖ ఆదివారం ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసింది. నెంబరు. 07097 సికింద్రాబాద్ - విశాఖ రైలు ఆదివారం రాత్రి 7.45కి బయలుదేరి సత్తెనపల్లికి 10.39, గుంటూరుకు 11.30, మరుసటి రోజు ఉదయం 6.30కి విశాఖ చేరుకొంటుంది. అలానే ఓటు వేసి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 13న రాత్రి 7.50కి నెంబరు. 07098 విశాఖ - సికింద్రాబాద్ రైలు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.25కి గుంటూరు, 3.20కి సత్తెనపల్లి, మంగళవారం ఉదయం 8.15కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఎవరైతే టిక్కెట్‌లు బుకింగ్ చేసుకోలేకపోయారో వారు ఈ రైళ్ల సర్వీసులను వినియోగించుకోవచ్చని రైల్వే అధికారులు ప్రకటించారు.

తెగిన నోట్ల కట్టలు.. తరలిన మద్యం

అధికార పార్టీ అభ్యర్థులకే మద్యం | ఒక్కదుకాణంపైనా కన్ను వేయని ఎస్ఈబీ

ప్రచారం ముగిసింది. మద్యం దుకాణాలూ మూతపడ్డాయి. కానీ నోట్ల కట్టలకు, మద్యం సీసాల మూటలకు మాత్రం కట్టడి లేకుండా పోయింది. ఓట్ల కొనుగోళ్లకు నోట్ల కట్టలు తెగి ప్రలోభాల కోసం పందేరం అయిపోతున్నాయి. శనివారం నుంచి మద్యం దుకాణాలకు సీలు పడుతుందని ముందే తెలిసి అధికార పార్టీ నేతలు, అభ్యర్థులు మద్యం కోసం జాగ్రత్తలు పడ్డారు. దుకాణాల్లోని సరుకును తరలించేశారు. మరోపక్క ఓటుకోసం నోట్ల పంపిణీ కూడా కొన్నిచోట్ల గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతుంటే, మరికొన్నిచోట్ల బహిరంగంగానే పంచేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఎన్నికల పరిశీలకులు కానీ, ఎస్ఈబీ అధికారులు కానీ వీటివైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఓటు కోసం కట్టలు తెంచుకున్న డబ్బు చాలాచోట్ల శుక్రవారం నుంచే పంపిణీ మొదలుకాగా శనివారం మరింత ఊపందుకుంది. తెనాలి నియోజకవర్గంలో ఒక పార్టీ రూ.వెయ్యి ఇస్తుంటే, మరోపార్టీ రూ.1500 పంపిణీ చేస్తోంది. అధికార పార్టీ మాత్రం కొన్నిచోట్ల రూ.వెయ్యి, మరికొన్నిచోట్ల రూ.1500 వరకు పంచుతున్నారని సమాచారం. పొన్నూరులోనూ ఓటుకు రూ.2 వేల వరకు పంచేస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థులు బహిరంగంగానే పంచుతున్నారు. మరికొన్నిచోట్ల అధికార, ప్రతిపక్ష సభ్యులు ఒకే మాటగా ఎవరిపైనా ఎవరూ ఫిర్యాదు చేసుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌కి ముందే ఎక్కడికక్కడ డబ్బు సిద్ధం చేసి ఉంచటంతో చెక్‌పోస్టుల దగ్గర, దాడుల్లో డబ్బు దొరకలేదు. పల్నాడుకు చెందిన నేతలే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అధికార పార్టీ అభ్యర్థులకు డబ్బు సమకూర్చేపనిలో ఉన్నారని సమాచారం. ఇక మద్యం విషయానికి వస్తే ప్రతిపక్ష పార్టీల నేతలకు మద్యం అందడం కష్టంగా మారింది. అధికార పార్టీ నేతలకు మాత్రం ప్రభుత్వ దుకాణాల నుంచే సరఫరా జరిగింది. అమ్మకాల్లో పరిమితి ఉన్నా ఒక్కో మద్యం దుకాణం నుంచి చీప్‌లిక్కర్ బాటిల్స్ 100 చొప్పున మూటలు కట్టి తరలించుకుపోయారు. ఒక్కో దుకాణం నుంచి కనీసం పది మూటల చొప్పున బహిరంగంగానే తీసుకుపోయారు. దుకాణాల వద్ద మందుబాబులు క్యూలో ఉన్నా మద్యం లేదని చెప్పడంతో వారు గొడవకు దిగిన ఘటనలు పలు చోట్ల కనిపించాయి.



భూముల కబ్జాకే ల్యాండ్ టైటిలింగ్

- ప్రజల ఆస్తులు కొల్లగొట్టేందుకు వైసీపీ కుట్ర
- జీవో పత్రాలను తగలబెట్టిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మే 11: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా భూములు భక్షించేందుకు జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు తెలిపారు. శనివారం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 512 జీవో కాపీలను ఎమ్మెల్యే ఏలూరి తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పట్టాలు, పాసుపుస్తకాలపై జగన్‌రెడ్డి ఫొటోలు, వైసీపీ రంగులు ఉండడంపై ప్రజలందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతుల భూములను కబ్జా చేసేందుకు వారి భూములపై ఆస్తులపై వైసీపీ నాయకులకు హక్కు కల్పించేందుకు, వారి పేర రాసేందుకే ల్యాండ్ టైటిలింగ్ అన్నారు. ఈ విషయమై రైతులు కోర్టులను ఆశ్రయించకుండా జీవోలో పొందుపరిచారని తెలిపారు. ప్రమాదకరమైన అంశాలతో కూడిన ఈ చట్టాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. మన ఆస్తులను, మన భూములను రక్షించుకోవడానికి జగన్‌రెడ్డి ఆపార్టీ అభ్యర్థులందరికీ ఓటుతో బుద్ధి చెప్పాలని ఏలూరి ప్రజలను కోరారు. జగన్‌రెడ్డి బినామీ కంపెనీకి(ఇండోసోల్) ఒక్క రామాయపట్నం పరిసరాల్లో 8500 ఎకరాల రైతుల భూములను కారు చవకగా కట్ట బెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసం పిల్లల భవిష్యత్ కోసం టీడీపీ కూటమి అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.



ల్యాండ్ టైటిల్ జీవో కాపీలను దహనం చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్, అన్నం సతీష్, బాధితుడి భార్య



- పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధం.. ఎస్‌ఐ ఎదుట దాడి
- ఎస్‌ఐ, కోన వెంకట్‌పై కేసు నమోదు చేయాలని స్టేషన్ చుట్టుముట్టిన దళితులు
- దళితుడికి న్యాయం చేయాలని తెన్నేటి, వేగేశన, అన్నం డిమాండ్

టీడీపీలో చేరాడని దళితుడిపై దాష్టీకం

కర్లపాలెం, మే 11: మండలంలోని గణపవరం పంచాయతీ లంకమాల పల్లికి చెందిన దళిత నేత కత్తి రాజేశ్వరరావు(రాజేష్) శనివారం ఉదయం బాపట్ల అసెంబ్లీ కూటమి అభ్యర్థి నరేంద్రవర్మ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. దీంతో బాపట్ల వైసీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతి బంధువు అయిన సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ ఫోన్ ఆదేశాలతో ఇంట్లో నిద్రిస్తున్న రాజేష్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆ వెంటనే స్టేషన్‌కు చేరుకున్న కోన వెంకట్ ఎస్‌ఐ జనార్ధన్ ఎదుటే దళితుడిపై చేయిచేసుకున్నారు. ఈ విషయం తెలిసిన కుటుంబసభ్యులు, బంధువులు, టీడీపీ నేతలు స్టేషన్‌ను చుట్టిముట్టి ఐదు గంటల సేపు ఆందోళన చేశారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, వేగేశన నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీరాల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సలగల రాజశేఖర్, డాక్టర్ చార్వాక, న్యాయవాదులు కళ్ళం హరినాథరెడ్డి, గవిని శ్రీనివాసరావు, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, బెజ్జం వెంకటేశ్వర్లు స్టేషన్ వద్దకు చేరుకుని దళితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఫిర్యాదు లేకుండా కోన వెంకట్ చెప్పారని దళితుడ్ని ఎస్‌ఐ స్టేషన్‌కు పిలిపించడంపై డీఎస్పీ మురళీకృష్ణ ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు.



న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బాధితుడి బంధువులు

కులం పేరుతో దూషించి దాడి

కోన వెంకట్, అతడి అనుచరులు మార్పు బెనర్జి, మార్పు రత్నం, కాగిత మోషె, నక్కా సంతోష్‌లు ఎస్‌ఐ సమక్షంలోనే కులం పేరుతో దూషించి, కాలుతో తన్నారని రాజేష్ డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పార్టీ మారటం నీ ఇష్టమా, ఎంతకు అమ్ముడు పోయావు.. నిన్ను చంపితే దిక్కు ఎవరు, మా బాబాయి కాబోయే ఎమ్మెల్యే అంటూ ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. ఎస్‌ఐ కూడా చెంపలపై కొట్టి, పెద్దవారితో నీకేందుకురా అని తిట్టాడన్నారు.

ఎస్‌ఐపై వేటు

రాజేశ్‌పై దాడి చేసిన కోన వెంకట్‌తో పాటు ఆయన అనుచరులు, ఎస్‌ఐ జనార్ధన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్‌ఐను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రైతు నిలవాలంటే టీడీపీ గెలవాలి..

- నీటిని తెచ్చి పలనాడును సస్యశ్యామలం చేస్తా
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తాం
- పల్నాడు ప్రాంతంపై ప్రేమతోటే ఇక్కడి నుంచి పోటీ..
- ప్రచార ర్యాలీలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు
- భారీగా తరలి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, శ్రేణులు


ట్రాక్టర్ పై ర్యాలీగా వెళ్తున్న లావు శ్రీ కృష్ణ దేవరాయలు

సత్తెనపల్లి మే 11: సత్తెనపల్లినుండి నరసనరావుపేట వరకు ఉమ్మడి కూటమి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు ప్రచార ముగింపు ర్యాలీ శనివారం ఘనంగా జరిగింది. సత్తెన పల్లి చెక్ పోస్టు వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. భారీ ఎత్తున ట్రాక్టర్లతో నరసరావుపేట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని తెచ్చుకుంటేనే పలన్నాడు ప్రజల జీవన గమనం మారేది అన్నారు. వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసు కో వాలన్నారు. సాగర్ కుడి కాలవను గోదావరి జలాలతో స్థిరీకరణ చేసుకోవాలన్నారు. జల్ జీవన మిషన్ ద్వారా ఇంటింటికీ కులాయి కలెక్షన్ అందిస్తామన్నారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తామన్నారు. ప్రజల భూసమస్యలను పరిష్కరిం చేందుకు కట్టుబడి ఉంటామన్నారు. పల్నాడు ప్రజలంతా తమవైపే ఉన్నారని దీమా వ్యక్తం చేశారు. పలనాడు ప్రాంతంపై మక్కువ తోనే అభివృద్ధి చేయాలన్న ఇష్టంతోనే నరసరావు పేట నుండి పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధికారం లోకి రావాలని చంద్రబాబునాయుడు సీఎం కావాలన్నారు. మే13న జరిగే ఎన్నికలలో సైకల్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలన్నారు. సత్తెనపల్లినుండి నరసరావుపేటవరకు పండుగ లాగా ర్యాలీసాగింది. రహదారులన్నీ జన సంద్ర మయ్యాయి. పార్టీ శ్రేణులు, ప్రజలు ప్రచారంలో అడుగడుగునా నీరాజనాలు పలికారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను గెలిపిస్తే నరసరావుపేట పార్ల మెంట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. శ్రీకృష్ణ దేవరాయల గెలుపు నరసరావు పేట పార్లమెంట్ అభివృద్ధికి మలుపు, టీడీపీ వర్ధిల్లాలి.. అంటూ కూటమి శ్రేణులు, ప్రజలు నినాదాలు చేశారు.

లావు మేఘన ప్రచారం .. నరసరావుపేట పార్లమెంట్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి మేఘన సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి లావు శ్రీ కృష్ణ దేవరాయలను, సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను గెలిపించాలని పిలుపు నిచ్చారు.


భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నేతలు, కూటమి శ్రేణులు

శ్రీకృష్ణ.. అరవింద ప్రదర్శన

నరసరావుపేట, మే11: ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా టీడీపీ కూటమి ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రజలకు అభివాదం తెలుపుతూ ర్యాలీలో ముందుకు కదిలారు. మూలకలూరు, ఇస్సపాలెం, సత్తెనపల్లిరోడ్డు, మల్లమ్మ సెంటర్, పల్నాడు బస్టాండ్ మీదుగా పాల చెక్‌పోస్టు సెంటర్ వరకు సాగింది. మహిళలు, యువకులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు.

డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందించడం జరుగుతుందన్నారు. అధికారంలోకి రాగనే నెలకు రూ.4వేలు ఫించన్ పంపిణీ, రైతులకు పెట్టుబడి సాయం, మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాలన్నా, అభివృద్ధి విస్తృతంగా అమలు జరగాలన్నా చంద్రబాబును మళ్లీ సీఎంను చేయాలని విజ్ఞప్తిచేశారు. తనను ఆదరిస్తే అండగా ఉంటానని తెలిపారు. తనకు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలుకు సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అరవింద బాబు విజ్ఞప్తి చేశారు.


అభివాదం చేస్తున్న డాక్టర్ అరవింద బాబు, లావు శ్రీకృష్ణదేవరాయలు

లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడుకి తాగు, సాగు నీరు తీసుకువస్తేనే ఇక్కడి ప్రజల జీవనగమనం మారుతుందని, ఇందుకు మనం వరికెపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేసుకోవాలని, సాగర్ కుడి కాలవను గోదావరి జలాలతో స్థిరీకరణ చేసి, జల్‌జీవన్ మిషను పూర్తిచేయాలని, ఇవన్నీ నిబద్ధతగా జరగాలంటే టీడీపీఈ అధికారంలోకి వచ్చి. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. 13వ తేదీ జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, అరవిందబాబుని గెలిపించాలని కోరారు. ప్రదర్శనలో నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

కూటమికి 130 -140 సీట్లు ఖాయం

- ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలి..
- వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం మూడు దశాబ్దాల వెనక్కి
- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని


మాట్లాడుతున్న పెమ్మసాని

గుంటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ- జనసేన- బీజేపీ కూటమికి 130- 140 ఎమ్మెల్యే సీట్లు, 20- 22 ఎంపీ సీట్లు, తనకు 2 నుంచి 3 లక్షల మెజార్టీ వస్తుందని పెమ్మసాని ఆశాభావం వ్యక్తం చేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని పెమ్మసాని కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపిస్తోందని, ముఖ్యంగా మహిళల్లో ఆదరణ మరింత ఎక్కువగా ఉందని తెలిపారు. సమాజానికి ఏదైనా మంచి చేయాలని వచ్చే తనలాంటి వాళ్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నట్లు ప్రచారంలో తనకు తెలిసిందన్నారు. నాలుగు నెలలు ప్రజల మధ్య తిరిగానని, పట్టణాలు, గ్రామాలు, వార్డుల్లో 300 పైగా బహిరంగ సభల్ని ఏర్పాటు చేసి ప్రజలకు చేరువయ్యానన్నారు. వైసీపీ తరుపున గుంటూరు పార్లమెంటుకు పోటీచేస్తున్న కిలారు రోశయ్య మూడు రాజధానులకు మద్దతు ఇస్తున్నారని, తాను అమరావతికి మద్దతుగా వున్నానని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జగన్‌రెడ్డి తాను సంపాదించిన అవినీతి సొమ్ముతో ఎన్నో రకాల ప్రలోభాలకు తెరతీయబోతున్నారని, ఆ అవినీతి సొమ్ముతో ప్రజల ఓటును గెలవలేరని, అరాచకత్వం, అణచివేతతో ప్రజల మనసులు గెలవలేరని, అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లలేరని, కులాల మధ్య విద్వేషాలతో ప్రజలను చీల్చలేరని ప్రజలు తమ ఓటుతో రుజువు చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తనకు ఒక్క రోజు ఓటేస్తే ఐదేళ్ల ప్రజల కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. నీళ్లు, నిరుద్యోగం, రహదారులు, మౌలిక సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను తాను గుర్తించానని, వాటి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అలాగే గంజాయి నిర్మూలన తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 2019కి ముందు గుంటూరు ఛానల్ అభివృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం 250కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేసిందని, కానీ అధికారంలోకి వచ్చాక జగన్ ఆ జీవో నిధుల్ని దారి మళ్లించారని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ప్రమాదకరమైనదని, దాన్ని రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- వ్యవసాయమోటారుకు ఫీజు వేస్తుండగా షాక్ ..

శ్రీనగర్(ఈపూరు), మే11: విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీనగర్‌లో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల పరమేశ్వరరెడ్డి (26) వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు వేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. పరమేశ్వరరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్‌కే మహమ్మద్ ఫిరోజ్ తెలిపారు.

గుంటూరు తూర్పులో కూటమి గెలుపు ఖాయం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, మొహమ్మద్ నసీర్
- ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా భారీ రోడ్ షో

గుంటూరు, మే 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి విజయకేతనం ఎగరవేయడం ఖాయమని మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు పార్లమెంటు, గుంటూరు తూర్పు అసెంబ్లీ కూటమి అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, మొహమ్మద్ నసీర్, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, డిప్యూటీ మేయర్ షాజీలా, భరత్ రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా భారీ రోడ్ షో నిర్వహించారు. గుంటూరు తూర్పునియోజకవర్గ ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ కూటమికి రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రభంజనం వీస్తోందన్నారు. 130 నుంచి 140 సీట్లు వస్తాయని అన్ని సర్వేలు చెబుతున్నాయని అన్నారు. 2019లో పాలిచ్చే


గుంటూరు తూర్పులో రోడ్‌షో నిర్వహిస్తున్న పెమ్మసాని, నసీర్, డేగల తదితరులు


ప్రచారంలో భాగంగా స్థానికులతో పెమ్మసాని, నసీర్

ఆవును కాదని తన్నే దున్నపోతును ఎన్నుకోవడంతో ఐదేళ్లలో రాష్ట్రం అన్ని విధాలుగా వెనుకబడిందన్నారు. పారిశ్రమలు, పెట్టుబడి, అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు లేకుండా పోవడమే కాకుండా, అప్పులు మాత్రం లక్షల కోట్లు ప్రజల నెత్తిన పడ్డాయన్నారు. రాష్ట్రం అప్పుల ఊబి నుంచి బయట పడేసేందుకు చంద్రబాబుని సీఎం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా తన కూతురికి ఓట్లు పడే పరిస్థితి లేదని తెలిసి మైనార్టీ ఓట్లను దండుకునేందుకు విష ప్రచారాలు చేస్తున్నాడన్నారు. నాలుగు శాతం మైనారిటీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మైనార్టీలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలందరూ వాస్తవాలను అర్థం చేసుకొని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పోలీసుల అదుపులో
నకిలీ జీఎస్టీ అధికారి

మంగళగిరి, మే11: జీఎస్టీ అధికారినంటూ పరిశ్రమల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలిలా వున్నాయి..


నకిలీ అధికారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

విజయవాడకు చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి రెండు రోజులక్రితం ఎర్రబాలెంలో ఎస్ఆర్ ఇండస్ట్రీస్ నిర్వాహకుడు రామరాజును కలిసి తాను సీజీఎస్టీ అధికా రినని పరిచయం చేసుకున్నాడు. కంపెనీ వివరాలు అడిగి తెలుసుకుని, కొన్ని లోపాలు వున్నాయని, రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ పరిశ్రమలో పన్ను చెల్లింపులు, రికార్డులన్నీ సక్ర మంగానే వున్నాయని, అంత మొత్తం ఇవ్వలేనని, ఏమైనా వుంటే తమ ఆడిటర్‌తో మాట్లాడుకోవాలని యజమాని సూ చించారు. ఆపై ఆడిటర్ సహకారంతో సీజీఎస్టీ ఉన్నతాధి కారులను ఆశ్రయించాడు. అతనెవరో తమకు తెలియ దని, పోలీసులకు సమాచారం అందించి కేసు పెట్టాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో నకిలీ అధికారి శనివారం మధ్యాహ్నం డబ్బుకోసం ఎర్రబాలెం రాగా పరిశ్రమల యజమానులు నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. సదరు నకిలీ అధికారి పారిశ్రామికవాడల్లో పరిశ్రమల యజమానులే లక్ష్యంగా విజయవాడ, మంగళగిరి, కానూరు ప్రాంతాల్లో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు బాధితులు తెలిపారు.

ఆలయ స్థలం కబ్జా.. విక్రయం

నరసరావుపేట, మే11: కోటప్పకొండ దిగువ ఉన్న ఆలయాల స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేశారు. ఇంతటితో ఆగక ఆ స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... కోటప్పకొండ దిగువన జంక్షన్‌లోని శ్రీ భువనేశ్వరీ అమ్మవారు, శ్రీ నీలకంఠేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నకోటేశ్వర స్వామివార్ల దేవాలయాల ప్రహరీ గోడలను అర్‌అండ్‌బీ శాఖ రహదారి వెడల్పు చేసే సాకుతో పడగొట్టారు. దీనిపై దేవాలయాల ధర్మకర్తలు హైకోర్టును ఆశ్రయించారు. (కంటెంప్ట్ కేసు నంబరు 773/2021) దేవాల యపు ప్రహరీ పడగొట్టిన చోటనే మళ్లీ కట్టమని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కానీ ఒక ప్రణాళిక ప్రకారం ఆర్‌అండ్‌బీ స్థానిక పెద్దలతో కుమ్మక్కై పడగొట్టిన స్థానంలో ప్రహరీ కట్టకుండా సుమారు 15అడుగులు వెనుక్కు నిర్మించారు. ఇలా కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా కట్టటం కోర్టు ధిక్కారణ చర్యగా పరిగణించబడుతుందని ధర్మకర్తల తరపున వనమా ప్రభుకుమారి తెలిపారు. అంతేకాక ఇదివరకటి పాత గోడకు ఆర్‌అండ్‌బీ శాఖ కొత్తగా వెనుక్కు నిర్మించిన కొత్తగోడకు మధ్యన మిగిలిన స్థలాన్ని ముక్కు వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఈ నెల 2న 27494, 27495, 27496 నెంబర్ల ద్వారా విక్రయించి క్రయ ధనం పొందారని తెలిపారు. దీనిని ఆక్రమణలు, ల్యాండ్ గ్రాబింగ్ కింద పరిగణించాల్సి ఉంటుందని, చట్ట ప్రకారం ఈ విక్రయాలు చెల్లుబాటు కావని తెలిపారు.

మంగళగిరి నియోజకవర్గంలో
రాజకీయాలకు అతీతంగా లోకేశ్ సేవ


- అన్ని వర్గాల ప్రజలూ లోకేశ్ వెంటే..
- అమరావతి మహిళలపై జగన్ సర్కారు దమనకాండ
- ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్టు కాదు.. ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు
- ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ


పంచుమర్తి అనురాధ

మంగళగిరి సిటీ, మే11: మంగళగిరిని సొంత కుటుంబంలా భావించి గడిచిన నాలుగున్నరేళ్లలో రాజకీయాలకు అతీతంగా నారా లోకేశ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మం గళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడా రు. మంగళగిరిలో అన్నివర్గాల ప్రజలూ లోకేశ్ వెంటే ఉన్నారని, ఆయన 80 వేలకు పైగా మెజార్టీతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు. వధూవరులకు పెళ్లికానుక, అన్న క్యాంటీన్లు, తోపుడు బండ్లు, కుట్టుమిషన్లు, నూలు వడికే రాట్నాలు, సంజీవని ఆరోగ్య కేంద్రాలు, యువతకు సాంకేతిక విద్యలో ఉచిత శిక్షణ, ఉత్తమ ప్రమాణాలతో క్రీడా పోటీలు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఇస్త్రీ బం డ్లు, పండుగ కానుకలు, సెలూన్ కుర్చీలు, స్వర్ణకారులు, శ్రామికులకు వృత్తిపరమైన పరికరాలు అందించి లోకేశ్ మంగళగిరి ప్రజల మనస్సు గెలిచారని చెప్పారు. మంగళగిరిలో లోకేశ్ గెలిస్తే ఈ నియోజకవర్గం ఆదర్శవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరిగాయన్నారు. వైసీపీ నేత ధర్మవరం వస్త్ర వ్యాపారులను నగ్నంగా కూర్చోపెట్టి హింసిస్తే లోకేశ్ ఆదేశాలతో తామంతా ధర్మవరం వెళ్లి బాధిత వస్త్ర వ్యాపారులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి కుటుంబం బాధితులను కనీసం పరామర్శించలేదని విమర్శించారు. జగన్ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పూర్తిగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్టని ఆరోపించారు. ఈ చట్టం వల్ల కడప జిల్లా ఒంటి మిట్ట లో ఓ చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి చెందిన యువతికి టీడీపీ అన్ని విధాలా భరోసా కల్పించిందన్నారు. వైసీపీలోని చేనేత నాయకులు ఈ విషయమై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. అమరావతి కోసం ఉద్యమిస్తున్న మహి ళలపై జగన్ ప్రభుత్వం దమనకాండ సాగించిందన్నారు. మహిళలపై హింసకు పాల్పడిన వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను తీసుకువచ్చారని తెలిపారు. షెడ్డులో నేత నేసే చేనేత కార్మికులకు కూడా నేతన్న నేస్తం, చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఆప్కోను బలోపే తం చేయడంతోపాటు వీవర్ శాలను విస్తరించడం, స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా కూటమికి అండగా నిలిచి మంగళగిరిలో నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ అనురాధ పిలుపునిచ్చారు.

రాజధాని అమరావతి లక్షల కోట్ల రాష్ట్ర సంపద

- 1607వ రోజుకు చేరుకున్న ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 11: అభివృద్ధి సంక్షేమం చేసే నాయకుడికి ఓట్లు వేయాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు విజ్ఞప్తి చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు శనివారం నాటికి 1607 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. అమరావతి లక్షల కోట్ల రాష్ట్ర సంపదన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటే రాష్ట్ర భవిష్యత్ బంగారు బాట వేసినట్టు అవుతుందన్నారు. లేదంటే మరింత నాశనం చేసుకున్నట్లేనని అన్నారు. ఓటు అనే ఆయుధంతో అరాచక వైసీపీ ప్రభుత్వాని భూస్థాపితం చే సి రాష్ట్ర రాజధాని అమరావతిని కాపాడుకోవాలని విన్నవించారు. అసమర్థ పరిపాలనతో రాష్ట్ర ఇరవై సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. ప్రజలు విజనరి ఉన్న నాయకుడికి ఓటు వేయాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

పోలింగ్‌సిబ్బంది విధులు కేటాయింపుపై ర్యాండమైజేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ్‌సింగ్ చిత్రంలో ఖాజన్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

బాపట్ల, మే 11 : జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు సూక్ష్మపరిశీలకులు, ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవోలు, ఓపీవోలను నియమించే ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ్ సింగ్, ఖాజన్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ద్వారా ర్యాండమైజేషన్ చేపట్టారు. జిల్లాలోని 1510 పోలిం గ్ కేంద్రాలకు 120 శాతం పోలింగ్ సిబ్బందిని నియమించే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి ప్రారంభించారు. 12న సంబంధిత పోలింగ్ సిబ్బందికి నియమాక పత్రాలను డిస్టిబ్యూషన్ సెంటర్‌లలో అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎన్ఐసీ అధికారి సాగర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వెబ్ క్యాస్టింగ్ కంట్రోల్‌రూమ్ పరిశీలన

ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించటానికి కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్‌క్యాస్టింగ్ కంట్రోల్‌రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం పరిశీలించారు. జిల్లాలోని 6 అసెంబ్లీనియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ కెమెరాలు అమర్చటం, వాటి పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. తదుపరి సి విజిల్‌యాప్ కంట్రోల్‌రూమ్ పరిశీలించారు. తొలుత బాపట్ల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బాపట్లఅసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. 202 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి తరలించటానికి చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 గుర్తింపు కార్డులు

ఓటు హక్కు వినియోగించుకోవటానికి ఓటరుకార్డు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపుకార్డులతో ఓటు వినియోగించుకోవచ్చు అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఎన్నికల కంట్రోల్‌రూమ్‌లో 08643-297802 టోల్‌ఫ్రీనెంబర్‌ను, 1950 టోల్‌ఫ్రీనెంబరును ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే తక్షణమే టోల్‌ఫ్రీనెంబరుకు కాల్ చేయవచ్చు అన్నారు. సదరు సమస్యను తక్షణమే పరిష్కరిస్తామన్నారు.

మండూరులో ప్రచార ర్యాలీ

చుండూరు, మే 11 : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చివరి రోజు అయిన శనివారం జోరుగా నిర్వహించారు. ఇంటింటి నుంచి మహిళలు, పిల్లలతో సహా గతంలో ఎన్నడూ లేని విధంగా ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు ద్వారానే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు నాగేశ్వరరావు, కేలం శ్రీనివాసరావు, జొన్నకూటి సాంబశివరావు, దేవిరెడ్డి సుబ్బయ్య, అశోక్, రాంబాబు, ఖాశిం, సుగ్గునబాబు, యాసం అనీల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్

నగరం, మే 11 : మండలంలోని ఎస్ఈబీ స్టేషన్‌ను డిప్యూటి కమిషనర్ కె.హేమంత్ నాగరాజు పరిశీలించారు. జిల్లాలో ఎస్ఈబీ పనితీరును పరిశీలించి సిబ్బందితో క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని తెలిపారు. అక్రమ మద్యం సరఫరాను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరం స్టేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్, ఎస్‌హెచ్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

కర్లపాలెం, మే 11 : మండలంలోని చింతాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మరకా శ్రీనివాసరావు ఇంటి వద్ద టీడీపీ కార్యకర్త మద్దిబోయన నాగార్జున అక్కడ ఉండగా శనివారం రాత్రి 8 గంటల సమయంలో అదేగ్రామానికి చెందిన ఎలికా వాసు, ఎలికా గోపి, ఎలికా మహేష్ చాక్‌తో దాడి చేసి కుడి తొడపై పొడిచారని, నా ఎడమ వీపు మీద తలపైన కొట్టారని, మిమ్ము మేము వదలమని దుర్భాషలాడారని బాధితుడు మద్దిబోయన నాగార్జున బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. వారి వల్ల నాకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై డీఎస్పీ మాట్లాడుతూ వారిపై కేసు నమోదు చేసి చర్యలు చేపడుతామని తెలిపారు.

టీడీపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయం

- ప్రజలందరూ ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



గరువుపాలెం ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 11 : తీరప్రాంత ప్రజలు రెండుసార్లుగా నాపై నమ్మకంతో ఆదరించారని సోమవారం జరిగే ఎన్నికల్లో మహిళలు, ప్రజలు అండగా నిలిచి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రజలను కోరారు. నిజాంపట్నం మండలం ఆముదాలపల్లి, కొమరవోలు, ముత్తుపల్లి, చెరుకుపల్లి మండలం పొదిలిపల్లివారిపాలెంలో శనివారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఎన్నికల ముగింపు ప్రచారం నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అనగానికి గుమ్మడికాయతో దిష్టితీసి వీరతిలకం తీసి హారతులు తీసి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రానున్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వమేనని, తీరప్రాంత అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీనిచ్చారు. అదేవిధంగా టీడీపీ ప్రభుత్వ కూటమి ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ పథకాలతో మీరు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని ఆకాంక్షించారు. జగన్‌రెడ్డికి ఓటు వేస్తే విధ్వంసానికి ఓటు వేసినట్లేనని అన్నారు. రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీ అభ్యర్థి అయిన తనకు, ఎంపీ అభ్యర్థి అయిన కృష్ణప్రసాద్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నర్రా సుబ్బయ్య, తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, పిట్టు శ్రీనివాస్‌రెడ్డి, మల్లాది రామకృష్ణ, కేసన రామకృష్ణ, జనసేన నాయకులు మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వం వస్తేనే సాగునీరు : అనగాని

చెరుకుపల్లి, మే 11 : రాష్ట్రంలోని రైతులు పంటలను సక్రమంగా పండించేందుకు సాగునీరును అందించాలంటే టీడీపీ ప్రభుత్వం వస్తేనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం చెరుకుపల్లి మండలం పొదిలివారిపాలెం గ్రామంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు సుభిక్షంగా లేరని, సైకో పాలనను అంతం మొందించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి సైకిల్‌గుర్తుపై ఓటు వేయాలని ఆయన కోరారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకపోవటంతో యువతకు ఉద్యోగాలు లేవని, చంద్రబాబు పాలనలో యువతకు ఉద్యోగ కల్పన ఉండేదని ఆయన తెలిపారు. చంద్రబాబును గెలిపించుకుంటే తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పై పెడతానని హామీనిచ్చారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కావాలంటే సైకిల్‌గుర్తుకుఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, జనసేన పార్టీ అధ్యక్షులు ధూళ్ళ సురేష్, గ్రామపార్టీ అధ్యక్షులు గాదె సాంబశివరావు, టీడీపీ నాయకులు దాసరి శ్రీనివాసరావు, గాదె బోసుబాబు, గాదె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఆముదాలపల్లిలో ఎమ్మెల్యే అనగానిని గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఈవీఎంలను భద్రపరచే వరకు అప్రమత్తంగా ఉండాలి

- స్ట్రాంగ్‌రూంను పరిశీలించిన అబ్జర్వర్ అయ్యప్పన్



భట్టిప్రోలులో స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న పోలీస్ అబ్జర్వర్ ఐపీఎస్ అయ్యప్పన్

భట్టిప్రోలు, మే 11 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఎన్నికలు ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపరచే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అబ్జర్వర్ ఐపీఎస్ అయ్యప్పన్ ఆదేశించారు. భట్టిప్రోలులోని విశ్వశాంతి హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను శనివారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద ఎలాంటి భద్రతను కల్పించారని ఎవరెవరు భద్రతా విధుల్లో ఉంటున్నారని ఎన్నికల అధికారి వసంతరాయుడును అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అయ్యప్పన్ పలు సూచనలు చేశారు.

ఎన్నికల నిర్వహణకు అవసరమైన మెటీరియల్ పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి వసంతరాయుడు తెలి పారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గల పంపిణీ కేంద్రం వద్ద శనివారం ఉద్యోగులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 233 పోలింగ్ కేంద్రాలకు సెక్టార్‌ల వారీగా మెటీరియల్ ను పంపిణీ చేసేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామన్నారు. 1500 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారన్నారు.

● వేమూరు, మే 11: నియోజకవర్గంలో 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు తెలిపారు. శనివారం ఆయన వేమూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో 1,97,458 మంది ఓటర్లు 233 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు.

బూత్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాట్లు

కొల్లూరు, మే 11: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. కొల్లూరు మండలం లో ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద పంచాయతీ సిబ్బంది బారికేడ్ల ను ఏర్పాటు చేశారు. మండలకేంద్రంలో ఉన్న 15 కేంద్రాలను శుభ్రపరిచి బూత్‌ల వద్ద ఓటర్ల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశా రు. ఆదివారం ఉదయం ఆయా కేంద్రాల వద్ద టెంట్లను ఏర్పాటు చేయనున్నట్లు కార్యదర్శి మల్లికార్జున శనివారం సాయంత్రం పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే అనగానిని గెలిపించండి

- ఎమ్మెల్యే సోదరి కమల అనగాని



అనగానిని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ కమల

రేపల్లె, మే 11 : సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగానికి నియోజకవర్గ ప్రజలు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అనగాని సోదరి డాక్టర్ అనగాని కమల అన్నారు. శనివారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఏన్డీఏ కూటమి అభ్యర్థి అయిన అనగాని సత్యప్రసాద్‌కు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నాగలక్ష్మి, భవిత, వర్థిని, విజయశ్రీ, తుమ్మల శాంతి, శ్రీలక్ష్మి, భార్గవి, రాజేశ్వరి, హైమా తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకే మాదిగల మద్దతు

- మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్

వేమూరు, మే 11 : రాష్ట్రంలో మాదిగల మద్దతు కూటమి అభ్యర్థులకే ఉంటుందని రాష్ట్ర మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్య క్షుడు పొన్నెకంటి రమేష్ మాదిగ పేర్కొన్నారు. శనివారం ఆయన వేమూరులోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆనందబాబును గెలిపించాలంటూ ప్రతులను విడుదల చేశారు. వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబును బాపట్ల ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మాదిగ దండోరా ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి అనీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు సోడాగుడి శ్రీఖర్, కాకర్ల మూడి రమేష్, కొలకలూరి జాన్, బిసి పోతు సంతోష్, వినోద్ పాల్గొన్నారు.


టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు అందిస్తున్న ఎమ్మెల్యే అనగాని

వేమూరులో.. జనాదరణ


సైకిల్ తొక్కుతూ ప్రచారంలో పాల్గొన్న ఆనందబాబు

- నియోజకవర్గంలో సైకిల్ జోరు
- ప్రగతికే పట్టం కడతామంటున్న ఓటర్లు
- ఆనందబాబు విజయం నల్లేరు మీద నడకే
- చుండూరు మండలంలోనూ టిడిపిదే పై చేయి
- 30వేలుపై చిలుకు మెజార్టీ సాధిస్తామని పార్టీ శ్రేణుల దీమా

వేమూరు, మే 11: సార్వత్రిక ఎన్నికల్లో వేమూరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు వైసీపీ, టీడీపీ మొదటి దశలో నువ్వా నేనా అన్న రీతిలో పోటీ పడగా రానురాను ప్రజల మనో భావాలు మారడంతో సైకిల్ జోరు స్పష్టంగా కనపడుతోంది. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేస్తూ మంత్రి హోదాలో నక్కా ఆనందబాబు నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమాన్ని సమతుల్యంగా అందించారు. రూ.1100కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడంతో పాటు మరో రెండు వేల కోట్ల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టగా అదే సమయంలో 2019సార్వత్రిక ఎన్నికలు రావడం వల్ల ఎన్నికల కోడ్‌తో పనులకు ఆటంకం ఏర్పడింది. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ఎమ్మెల్యే నాగార్జున ఆనందబాబు మొదలెట్టిన అభివృద్ధి పనులను పూర్తిగా నిలిపివేశారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జాడలు లేకుండా పోయాయి. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో ప్రజలు రాజకీయంగా చైతన్య వంతులై ప్రగతికే పట్టం కడతామన్న నిర్ణయానికి వచ్చారు. వైసీపీ ఎమ్మెల్యేగా నాగార్జున మంత్రి పదవి చేపట్టి కూడా అభివృద్ధిపై దృష్టి సారించకపోగా ధనార్జనే ధ్యేయంగా పని చేశారనే భావన నియోజకవర్గ ప్రజలతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లో కూడా నెలకొంది. అయా పరిణామాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గ ప్రజలంతా గతంలో పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందించడంలో ముందున్న ఆనందబాబుకే జై కొడుతున్నారు. దీంతో ఆనందబాబు విజయం నల్లేరుపై నడక కానుందని నియోజకవర్గంలో ఓటర్లు బాహాటంగానే చెబుతున్నారు. ఇదిలా ఉండగా వైసీపీకి కంచుకోట అయిన చుండూరు మండలంలో కూడా ఈ ఎన్నికల్లో టీడీపీకి ఓటర్లు మొగ్గుచూపుతున్నారు. ఇది అనూహ్య పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అన్ని వర్గాల నుంచి వైసీపీ పాలనపై వచ్చిన వ్యతిరేకత, రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఉండి చేపట్టిన పనులు, ప్రజలకు అందించిన సేవలు ఈ ఎన్నికల్లో ఆనందబాబుకు ఎంతగానో కలసిరానున్నాయి. మొదటి నుంచి టీడీపీకి గట్టి పట్టు ఉన్న కొల్లూరు మండలంలో జనసేన తోడు కావడంతో ఈసారి గతంలో ఎన్నడూ లేని మెజార్టీ ఈ సారి కూటమికి రాబోతున్నట్లు తెలుస్తోంది. 2019ఎన్నికల్లో టీడీపీకి మెజార్టీ చూపించిన భట్టిప్రోలు మండలంలో ఈ మారు అత్యధిక మెజార్టీ కూటమికి దక్కుతుందని కూడా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా మండలంలో ఆనందబాబు పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిన సేవలు, ఓటమి పాలైనా ప్రజలతో మమేకం కావడంతో పార్టీ పరంగా, వ్యక్తిగతంగా కూడా ఆనందబాబు విశేష జనాదరణ సంపాదించుకున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో అమర్తలూరు మండలం ఆ పార్టీకి పునాది రాయిగా నిలిచింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో కొంత బీటలు వారినా ఈ ఎన్నికల్లో మళ్ళీ పుంజుకుని పూర్వ వైభవం సంతరించుకుంది. కూటమి అభ్యర్థి ఆనందబాబుకు మండలంలో అత్యధిక మెజార్టీ సాధించి పెట్టాలన్న దృఢసంలక్పంతో పార్టీ శ్రేణులు, ప్రజలతో పాటు ప్రవాస ఆంధ్రులు ఎంతగానో కృషి చేస్తున్నారు. కొన్ని సామాజిక వర్గాలతో చర్చించి కూటమి అభ్యర్థి ఆనందబాబుకు విజయం చేకూర్చి పెట్టాలని స్వచ్ఛందంగా తమ సహాయ సహకారాలు అందించడం ద్వారా వైసీపీకి ఈ మండలంలో ఊహించని ఎదురుదెబ్బ తగలుతోంది. కాపు సామాజిక వర్గంతో పాటు మిగిలిన వర్గాలు కూడా కూటమితో జత కట్టడంతో ఈసారి వేమూరు మండలంలో ఆనందబాబుకు మరింత బలాన్ని చేకూర్చనుంది. ఐదు మండలాల్లోను కూటమికే స్పష్టమైన మెజార్టీని ప్రజలు అందిస్తారని, దీంతో ఆనందబాబు విజయం ఖాయమని దీమా కూటమి శ్రేణుల్లో నెలకొంది.

రేపల్లెకు.. అండగా..

- సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు అండ
- ఐదేళ్ళ జగన్ పాలనలో విధ్వంసం, దోపిడీ దోచుకోవటం
- టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3వేల కోట్లతో అభివృద్ధి
- ఎమ్మెల్యే అనగాని


అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 11: ఐదేళ్ళ వైసీపీ పాలనలో ప్రజలు, యువత తీవ్రంగా నష్టపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమ్మడి మ్యానిఫెస్టో ద్వారా సూపర్‌సిక్స్ పథకాలతో కుటుంబాల్లో ఆర్థికంగా బలపడేలా చేస్తాం. తీరప్రాంతంలోని రేపల్లెను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తా.. ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలిచి తమకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలి అని ఎమ్మెల్యే అనగాని కోరారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులివి...

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలపాలిట వరం..

రేపల్లె నియోజకవర్గంలో వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఎమెల్యే అనగాని సత్యప్రసాద్ సహకారంతో 16వేల మంది రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 18.50 కోట్లు నిధులను అందించారు. పూర్తిస్థాయిలో ఆరోగ్యవంతులుగా కోలుకునేందుకు కృషి చేశారు.

రూ.8కోట్లతో ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, అభివృద్ధి..

లోవోల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు రూ.80 కోట్ల నిధులతో రేపల్లె మండలం మోర్తోట, మృత్యుంజయపాలెం, రేపల్లె పట్టణంలో, నిజాంపట్నం, చెరుకుపల్లి, నగరం మండలాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. కాలం చెల్లిన ఫీడర్లను తొలగించి నూతనంగా ఫీడర్లను ఏర్పాటుచేశారు. ఎప్పుడో 30 ఏళ్ళ కిందట వేసిన విద్యుత్‌లైన్‌ల స్థానంలో కొత్త స్తంభాలను, విద్యుత్‌లైన్‌లు, ట్రాన్స్‌పార్మర్లను ఏర్పాటు చేసి పట్టణ గ్రామాల్లో 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేశారు.

రూ.8కోట్లతో షాదీఖానాలు, చర్చిలు అభివృద్ధి..

శిథిలావస్థలో ఉన్న మసీదులు, చర్చిలను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి రూ.8కోట్ల నిధులను మంజూరు చేశారు. నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న 22 చర్చిలకు, 18 మసీదులకు అన్ని హంగులతో నూతనంగా నిర్మించారు. మసీదుల చుట్టూ ప్రహరీ, చర్చిలకు ప్రహరీ నిర్మించామని తెలిపారు.

ప్రజలకు చంద్రన్న బీమా ఆసరా..

నియోజకవర్గంలో నాలుగువేల మందికి చంద్రన్న బీమా ద్వారా ఆర్థిక స్వావలంభన అందించటంతో ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. చంద్రన్న బీమాకు సంబంధించి రూ.23 కోట్ల నిధులు బాధితులకు అందించారు.

యువకులకు భరోసా నిరుద్యోగ భృతి..

రేపల్లె నియోజకవర్గంలో నిరుద్యోగ భృతి కింద తొలివిడత నియోజకవర్గంలో రెండువేల మందికి రూ.10.53 లక్షలు నిధులను మంజూరు చేసి యువతను ఆదుకున్నారు. 2500 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని త్వరలో వారికి కూడా నిరుద్యోగ భృతి అందిస్తామని యువకులకు ఎమ్మెల్యే అనగాని హామీనిచ్చారు.


టీడీపీ ప్రభుత్వంలో గంగడిపాలెంకు చెందిన లివర్ వ్యాధితో బాధపడుతున్న నాయుడు సుజిత్‌కు రూ.12లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అనగాని

14 వేల మందికి ఎన్టీఆర్ గృహాలు..

రేపల్లె నియోజకవర్గంలో 14 వేల కుటుంబాలకు గృహాలను మంజూరు చేయగా రెండవ విడత 2500 గృహాలను మంజూరు చేసింది. పురపాలక సంఘంలో ఆల్‌ఫర్ ఆల్‌లో అపార్టుమెంట్‌ల తరహాలో 1500 గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 1500 మందికి అపార్ట్‌మెంట్ నిర్మాణాలు పూర్తయిన అనంతరం వారికి మంజూరు చేయనున్నారు.

చంద్రన్న పెళ్ళి కానుక..

చంద్రన్న పెళ్ళికానుక ద్వారా రేపల్లె నియోజకవర్గంలో 2.23 కోట్ల నిధులను మంజూరు చేసి 2500 మందికి లబ్ధి చేకూర్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల వారికి చంద్రన్న పెళ్ళికానుక ద్వారా ఆర్థికసాయం అందించారు.

డ్వాక్రా మహిళలకు 64 కోట్లు రుణాలు..

నియోజకవర్గంలోని 10000 డ్వాక్రా గ్రూపులకు 120 కోట్ల వడ్డీ లేని రుణాలను అందించి ఆ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా తోడ్పాటునందించారు.

సుందరంగా రేపల్లె పట్టణం..

పురపాలక సంఘంలో వేల కోట్ల రూపాయలతో రహదారులు, డ్రెయిన్‌లు నిర్మించారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా నాలుగున్నర సంవత్సరాల్లో అభివృద్ధి చేశారు. పురపాలక సంఘంలో 110 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారు. పట్టణంలో తాగునీటి సమస్యను నివారించేందుకు మార్కెట్ ఆవరణలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి కాలం చెల్లిన పైప్‌లను తొలగించి నూతన పైప్‌లైన్‌లు వేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తున్నారు. పురపాలక సంఘంలోని 28 వార్డుల్లో పది కోట్ల రూపాయలతో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశామన్నారు.

రహదారుల అభివృద్ధి

రూ.600 కోట్లతో రేపల్లె- పెనుమూడి, పెనుమూడి-మోర్తోట, సజ్జావారిపాలెం- అడవులదీవి, సజ్జావారిపాలెం-నగరం -చెరుకుపల్లి, గూడవల్లి నుంచి రాజోలు, బేతపూడి నుంచి పల్లెకోన, గోకర్ణమఠం అడ్డరోడ్డు నుంచి నిజాంపట్నం హార్బర్ వరకు సింగిల్‌లైన్ రహదారులను డబుల్‌లైన్ రహదారులుగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు.

అఖండ మెజార్టీతో గెలిపించాలి.....

తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలోని ఐదేళ్ళ వైసీపీ పాలనలో జరిగిన విధ్వాంస పాలనకు చరమగీతం పాడి తమకు అండగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతగానోదోహదపడతాయని పించన్‌లు రూ.4వేలు పెంపుదలతోపాటు మహిళలకు మూడు గ్యాస్ సిలెండర్లు, నెలనెల రూ.1500లు ఆర్థిక భృతి, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు గిట్టుబాటు ధర పూర్తిస్థాయిలో త్రాగునీరు అందించే విధంగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ప్రజలు అండగా ఉండి అఖండ మెజార్టీతోగెలిపించాలని ఆయన కోరారు.

గెలుపు దిశగా పయనం

- ఉత్సాహంలో తెలుగు యువత

బాపట్ల, మే 11: అన్నివర్గాల ప్రజల మద్దతు కూడగట్టటంలో సక్సెస్ అయిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ గెలుపుదిశగా పయనిస్తున్నారు. ఆయనతోపాటు ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ గెలుపు కోరుతూ ప్రచారం పూర్తి చేశారు. నియోజకవర్గంలోని బాపట్ల పట్టణ, మండలంతోపాటు కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో ప్రతిగ్రామాన్ని సందర్శించి విస్తృత ప్రచారం చేసి కూటమి అభ్యర్థుల విజయానికి మార్గం సులభం చేశారు. అడుగడుగున పార్టీశ్రేణులు, అభిమానులు ఉరకలేస్తున్న ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొని నరేంద్రవర్మను గెలిపించుకు తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజలతోపాటు నాయకులు మొత్తం నరేంద్రవర్మ వైపు చూస్తున్నారు. జనప్రభంజనంతో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఓటుతోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని నరేంద్రవర్మ స్పష్టం చేశారు. ఇప్పటికే నియోజకవర్గ ప్రజలకు సేవా కార్యక్రమాలతోపాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న తాను గెలిచిన వెంటనే ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తానని హామీనిస్తున్నారు. రెండు దశాబ్దాల తర్వాత బాపట్ల గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరవేయబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. తనదైనశైలీలో పావులు కదిపి అధికారపార్టీ శిబిరంలో ముఖ్యనాయకులందరిని తనవైపు తిప్పుకొని నరేంద్రవర్మ సత్తా చాటుకున్నారు. తెలుగుదేశం పార్టీశ్రేణులతో పాటు జనసేన, బీజేపీ శ్రేణులు సైతం సైనికుని వలే పనిచేస్తున్నారు. నియోజకవర్గంలోని 202 పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ శాతం పెంచి మెజార్టీ భారీఎత్తున వచ్చేందుకు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తామంతా కసితో పనిచేసి కచ్చితంగా విజయం చేకూర్చుతామని భరోసానిస్తున్నారు. ఈ ఏడాది బాపట్లలో తెలుగుదేశం జెండా ఎగరటం ఖాయం, ప్రజలు కోరుకున్న పాలన అందించటం తథ్యమని కూటమి అభ్యర్థులు పేర్కొంటున్నారు.



ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ, ఎన్నికల ప్రచారానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ యువత, నాయకులు

కలసికట్టుగా..

- ఎంపీ అభ్యర్థి తెన్నేటి విజయం కోరుతూ కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం
- నియోజకవర్గ ప్రజల మద్దతు


కృష్ణప్రసాద్ విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న ఆయన కుమార్తె తెన్నేటి రష్మి


తండ్రి విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న కుమార్తె తెన్నేటి రమ్యకృష్ణ

బాపట్ల, మే 11: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ విజయం కోరుతూ ఆయన కుటుంబ సభ్యులంతా విస్తృత ప్రచారం చేశారు. భార్య తెన్నేటి శిరీషకుమారి, కుమార్తెలు తెన్నేటి రష్మి, తెన్నేటి రమ్యకృష్ణతోపాటు మిగిలిన కుటుంబ సభ్యులు కూడా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7అసెంబ్లీ స్థానాల్లో ప్రచారం చేసి విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో పర్యటించి అక్కడ ప్రజలతో మమేకమై తాము గెలిస్తే చేపట్టే కార్యక్రమాలు గురించి వివరిస్తూ ఆకట్టుకునే విధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన వీరికి ప్రజల మద్దతు పెద్దఎత్తున లభించిం ముఖ్యంగా నియోజకవర్గంలోని యానాదికాలనీలు మొత్తం కలియతిరిగి ప్రతికాలనీలో వారి ఆర్థికాభివృద్ధికి భరోసానిచ్చారు. ప్రతి ఒక్కరు వీరికి మద్దతు తెలియజేయటంతో పాటు సత్కరించి సన్మానించారు. కృష్ణప్రసాద్ విజయం కోసం తామంతా కలిసికట్టుగా పనిచేస్తామని హామినిచ్చారు. వైసీపీ పాలనలో జరుగుతున్న అన్యాయం, అక్రమాలు గురించి ఎండగడుతూ యువత జీవితాలతో ఆటలాడుకుంటూ మత్తు పదార్థాలు, నాసిరకం మద్యం విక్రయిస్తున్నారంటూ ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళారు. బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాలలో తెన్నేటి కుటుంబం చేసిన ప్రచారానికి ప్రజలు నుంచి విశేషస్పందన లభించింది. అధికారిగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రత్యేకతను సంతరించుకున్నానని నాయకునిగా గెలిచి సేవకునిగా పనిచేస్తానని కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి, స్వయం ఉపాధి కల్పించి యువత భవితకు బంగారు బాటలు వేస్తానని ఆయన పేర్కొన్నారు. వీరి ప్రచారానికి ఆయా సంఘాల నాయకులు మద్దతు తెలియజేస్తున్నారు. వారితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారం పూర్తి చేసిన కృష్ణప్రసాద్ కుటుంబం ఎన్నికలలో గెలుపు కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొంటున్నారు.


ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్


కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ విజయం కోరుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆయన భార్య శిరీషాకుమారి

ప్రశాంత ఎన్నికలకు.. సంసిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల రూరల్, మే 11: ప్రశాంత వాతావరణంలో బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించటానికి సంసిద్ధమయ్యామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం 6గంటలు నుంచి 13వతేది సాయంత్రం 6గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమలలోఉంటుందని తెలిపారు. పౌరులు స్వేచ్ఛగా ఓటు వేయటం కొరకు 120శాతం పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. 12వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ యంత్రాలు, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపుతామన్నారు. ఎన్నికల సమయంలో ఎగ్జిట్ పోల్స్ ప్రచురణ, ప్రసారాలు నిషేదమన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు వెళ్ళటానికి మూడు వాహనాలు అనుమతిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీమ్‌లు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.5.30కోట్ల విలువ చేసే మద్యం, బంగారం, వెండిఆభరణాలు, బహుమతులు, ప్రచార సామాగ్రి తదితరమైన వాటిని సీజ్‌చేశామన్నారు. సీవిజిల్ యాప్‌లో వచ్చిన 735 ఫిర్యాదులను 32 నిమిషాలలోనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కోడ్ ఉల్లంఘించిన నలుగురు రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశామని 31మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 42మంది వలంటీర్లను తొలిగించామన్నారు. ఎన్నికల సమయంలో బాపట్లజిల్లాలో గొడవలు, అల్లర్లు నియంత్రణకు 10వేల మందిని బైండోవర్ చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లాలోని పోలీసు బలగాలే కాకుండా తమిళనాడు నుంచి 250మంది పోలీసులు, 5బీఎస్ఎఫ్, 3టీఎస్ఎస్‌పి, 1ఐటీబీపీ కంపెనీల సాయుధబలగాలు జిల్లాలో విధులు నిర్వహిస్తాయన్నారు. జిల్లాలో మొత్తం 913 పోలింగ్ ప్రాంతాలలో 1510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 269 ప్రాంతాలలో 337 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రితో వెళ్ళే పోలింగ్ సిబ్బందికి సాయుధబలగాలు, ఎస్కార్ట్‌గా వెళతాయని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200మీటర్లు పరిధిలో ఎలాంటి వాహనాలకు అనుమతిలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూఅధికారి సి.హెచ్.సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ళల్లో వైసీపీ అరాచక పాలన

- మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్


మాట్లాడుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన బాపట్ల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ, సతీష్ ప్రభాకర్

బాపట్ల, మే 11: గత ఐదేళ్ళ వైసీపీ ఆరాచకపాలనలో జరిగిన అన్యాయాలను గుర్తుంచుకొని కోన రఘుపతిలాంటి నాయకుడిని ఓడించాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీనాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. శనివారం బాపట్ల ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ స్వగృహంలో నరేంద్రవర్మ ప్రచారం ద్విగిజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రచారంలో పాల్గొని నరేంద్రవర్మ విజయానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్క కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తి మే 13 జరిగే పోలింగ్‌లో ఆఖరి క్షణం వరకు ప్రతిఒక్క కార్యకర్త, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో బాపట్ల ప్రజలు ఐదేళ్ళు నరకం చూశారని, ఇలాంటి పరిస్థితులు నుంచి పూర్తిగా బయట పడాలంటే ఒక సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వేగేశన నరేంద్రవర్మను, ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. బాపట్లలో తన తండ్రి విగ్రహాన్ని పెట్టటం కోసం చీలురోడ్డులో గల పురాతన ఆలయాన్ని ధ్వంసం చేయాలనుకున్న కోన రఘుపతి సరైన మూల్యం చెల్లించుకుంటాడని అన్నారు. సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్లలో వైసీపీ ఆరాచకాలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఈ ఎన్నికల్లో కోన రఘుపతిని ఓడించి ఐదేళ్ళ పాలనలో జరిగిన ఆరాచకాలకు, అక్రమాలకు ప్రతీకారం తీర్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు చేపట్టి యువతను పెడదారి పట్టించిన కోన రఘుపతికి ప్రతి తల్లి, తండ్రి సరిగ్గా బుద్ధి చెప్పాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే విద్యాలయాలలో అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక కమిటీగా ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకుండా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయటంతోపాటు పోలీసు ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేకఫోర్స్‌ను ఏర్పాటు చేసి గంజాయి మూకలపై ఉక్కుపాదం మోపుతానన్నారు. సంకీర్ణప్రభుత్వం ల్యాండ్ టైటిల్ విధానానికి వ్యతిరేకమని, ఈ విధానాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులను సంరక్షించే అన్ని బాధ్యతలను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రజలకు హామినిచ్చారు.

టీడీపీలో చేరికల జోరు

ఏలూరి సమక్షంలో సైకిలెక్కిన వైసీపీ శ్రేణులు

పర్చూరు, మే 11 : తెలుగుదేశం పార్టీలో చేరికల జోరు కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే ఏలూరి నినాదం హోరెత్తుతోంది. ప్రతి నిత్యం వందలాది మంది నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో సూకిలెక్కుతున్నారు. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన డెయిరీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య మేనల్లుడు ఎంపీటీసీ సభ్యుడు గుంటుపల్లి శివరామకృష్ణతోపాటు కోనంకి గ్రామ ఉపసర్పంచ్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఇది వైసీపీకి భారీ షాక్ అని ఆపార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి.

పర్చూరు మండలం బోడవాడ గ్రామానికి చెందిన దేవరకొండ రాముడు, దేవరకొండ శ్రీనివాసరావు, పెద్ద వెంకటేశ్వర్లు, వెంకటేష్, దుర్గా ప్రసాద్‌తోపాటు మరికొందరు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.

మండలంలోని కొల్లావారిపాలెం కాలనీకి చెందిన గద్దె చిరంజీవి, గన్నెపూడి వినోద్‌కుమార్, పునుగు విజేయ్‌రాజు, బిళ్ల శ్రీకారంత్, రూబేన్, పునుగు సాల్మన్, పిల్లి మోషే, అన్నమ్మ, శ్యాం, కోనా రవికుమార్, అంజయ్య, గర్రపుశాల శివయ్య, సూరాపోకుల బాబు, బిల్లా ఇసాక్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన జూపూరి సుభాష్ బాబు, ప్రేమ్‌కుమార్, సాల్మాన్, తిగూరి సుబ్బారెడ్డి, శీలం రాజారావు, జూపూడి అశోక్ టీడీపీలో చేరారు.

మార్టూరు గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాషా, షేక్ ఖాశిం, సుభానీ, సాదూబయా, అల్లాబక్ష్, షేక్ నజీర్, షేక్ కరిముల్లా, షేక్ జానీ, పఠాన్ కాలేషా, పఠాన్ షారూక్‌ఖాన్ సైకిలెక్కారు.

యద్దనపూడి మండలం ఇంజనంపాడుకు చెందిన పల్లెపోగు పెద్ద మస్తాన్, వంకాయలపాటి కల్యాణ్ పార్టీలో చేరారు.

ఇంకొల్లు మండలం భీమవరానికి చెందిన పాటిబండ్ల గోపి, చలిచం చినరాఘవరావు, మొగలి శ్రీను ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

వైసీపీని వీడి టీడీపీలో చేరిన భీమవరం గ్రామస్థులు

ఇంకొల్లు : మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన 20 మంది శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన భీమవరం సొసైటీ అధ్యక్షుడు పాటిబండ్ల గోపాలస్వామితో పాటు 20 మంది ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి ఏలూరి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పాటిబండ్ల శ్రీరామూర్తి, కోటా ఆదిశేషయ్య, మద్దినేని వెంకట్రావు, చలిచం చినరాఘవయ్య, అన్నెం రాఘవయ్య, మొగిలి శ్రీనివాసరావు, కంకట గోపాలస్వామి, చెన్నుపాటి శ్రీనివాసరావు, ఆళ్ల అప్పారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరగంధం ఆంజనేయులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన భీమవరం నేతలు

ప్రారంభించిన చోటే ముగింపు

వలపర్లలో ఏలూరి ఎన్నికల ప్రచారం పూర్తి

మార్టూరు, మే 11 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తన ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం సాయంత్రం ముగించారు. ఆయన మధ్యాహ్నం వలపర్ల గ్రామంలోని ప్రధాన వీధులలో ఇంటింటికీ తిరుగుతూ సైకిల్ గుర్తుపై ఓటేసి కూటమి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారాన్ని ఆయన ఇక్కడి నుంచే ప్రారంభించారు. 2014, 2019లో విజయం సాధించిన క్రమంలో తన ప్రచారాన్ని వలపర్ల నుంచి ప్రారంభించడం ఇక్కడే ముగించడం విశేషం. ప్రచార కార్యక్రమంలో నాయకులు కంభంపాటి హనుమంతరావు, జంజనం సుబ్బారావు, గుంటి వెంకటేశ్వర్లు, షేక్ బషీర్, వెలగా రామాంజనేయులు, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. ద్వారకపాడు గ్రామానికి చెందిన 12 కుటుంబాలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తా

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 11 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాలు, పునరావాస కాలనీల సమస్యలు పరిష్కరిస్తానని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ధేనువకొండలో గొట్టిపాటి రవికుమార్ శనివారం ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగారు. ఇసుక అక్రమ రవాణా కోసం గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు మరమ్మతులు చేయకుండా వైసీపీ పాలకులు వదిలివేశారని రవికుమార్ అన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలతో వైసీపీ నాయులు దండుకుంటున్నారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజల పై మోయలేని భారాలు మోపారన్నారు. సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలయ్యారన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్ లకు మీటర్ల ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు తీరని నష్టం చేసిందన్నారు. వృద్ధాప్య పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడంతోపాటు ఏప్రిల్ నుంచి పెంచిన పింఛన్‌ను రూ.7వేలు జులైలో అందిస్తామన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, జొన్నలగడ్డ గోపి, బత్తుల రామకోటయ్య, సర్పంచ్ ఇండ్లా పద్మ, గుంజి నాగరాజు, జొన్నలగడ్డ రామారావు, ఆంజనేయులు, అన్నాబత్తిన అజయ్, తుళ్లూరి వెంకటేశ్వర్లు, మాదాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

మణికేశ్వరం సర్పంచ్ టీడీపీలో చేరిక

మండలంలోని మణికేశ్వరం సర్పంచ్ మందా రూతువేణితో పాటు పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మణికేశ్వరం సర్పంచ్ రూతువేణి నాగయ్యతో పాటు వైసీపీ నేతలు మందా రవి, పౌలు, సుబ్బయ్య, దాసరి సుబ్బారావు, మందా తిమోతి, యోహోను, జక్రయ్య, డేవిడ్, ఇసాక్‌తో పాటు 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సైకిలెక్కిన 70 ఎస్టీ కుటుంబాలు

అద్దంకి పట్టణంలోని 8వ వార్డు పరిధిలో శ్రీరామ్‌కాలనీకి చెందిన 70 ఎస్టీ కుటుంబాలు ఎంపీటీసీ మాజీ సభ్యుడు జయింపు రామాంజనేయులు, కత్తి కామయ్య, బొజ్జా నరసింహ, ఇండ్లా శ్రీను, కొప్పోలు శ్రీను ఆధ్వర్యంలో శనివారం ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో వైసీపీని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నేతలు మాదాల రామాంజనేయులు, నర్రా శ్రీనివాసబాబు, నర్రా కాంతయ్య, నర్రా గోపాల్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే

మేదరమెట్ల : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత ఎన్టీఆర్‌దన్నారు. సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని ధైవాలరావూరులో తెలుగుదేశం అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు గొట్టిపాటి రవికుమార్, తెన్నేటి కృష్ణప్రసాద్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు సామాన్యుల నడ్డివిరిగేలా పెరిగాయన్నారు. విద్యుత్ చార్జీలు 9సార్లు పెంచి, ఎన్నికల హామీలను జగన్ విస్మరించారన్నారు. ఎలాంటి అభివృద్ధి చేయకుండానే అన్నీ చేశానని పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50ఏళ్లకే పింఛన్, వృద్ధులకు రూ.4వేల పింఛన్ అందజేస్తారన్నారు. ఆయన వెంట ధైవాలరావూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేనువకొండలో గొట్టిపాటికి గుమ్మడికాయతో దిష్టితీస్తున్న మహిళలు

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

సంతమాగులురు : నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌పై చంద్రబాబు సంతకం పెడతారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఏల్చూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన గొట్టిపాటి జగన్‌రెడ్డి పాలనలో దళితులకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యతనిస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు.

సంతమాగులూరు మండలంలో ఫ్యాన్‌కు ఎదురుగాలి

మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్యాన్‌కు ఎదురుగాలి వీస్తోంది. నిన్నటి వరకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన మండల స్థాయి నాయకులు వైసీపీలో చక్రం తిప్పారు. నేడు ఎన్నికల సమయం రావడంతో తిరిగి సొంత గూటికి చేరారు. కొన్ని గ్రామాల్లో నాయకులు వారివెంటే నడిచారు. దీంతో ఫ్యాన్ పార్టీ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతోంది. మండలం కుందుర్రు గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీనివాసరావు అతని అనుచరులతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో సంతమాగులూరు మండలంలో తెలుగుదేశం పార్టీలో జోష్ పెరిగింది. కార్యక్రమంలో కుప్పోకి ఏడుకొండలు, చావల నాగేశ్వరరావు, రాయవరపు వెంకయ్య, మేకల గోవిందరాజులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీ చేరిన మణికేశ్వరం సర్పంచ్ రూతువేణి



టీడీపీలో చేరిన 8వ వార్డు శ్రీరామ్‌కాలనీ ఎస్టీ కుటుంబాలు

ఎన్నికల సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు

అద్దంకి, మే 11 : ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రెండు బస్సులు అద్దంకి నుంచి మార్టూరు, పర్చూరు, చీరాల, బాపట్ల, చెరుకుపల్లి, భట్టిప్రోలు మీదుగా రేపల్లెకు వెళ్లాయని, అదే విధంగా రేపల్లె నుంచి అదే రూట్‌లో ఉదయం 6 గంటలకు బయలుదేరి అద్దంకి వస్తాయని డీఎం రామ్మోహనరావు తెలిపారు. అదే విధంగా ఎన్నికల కోసం పర్చూరు నియోజకవర్గానికి అద్దంకి డిపో నుంచి 10 బస్సులు ఉదయం 6 గంటలకు అద్దంకి నుంచి బయలుదేరి వెళ్తాయని తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రమాదకరం

టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు రామకోటయ్య

అద్దంకి, మే 11 : జగన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అన్నదాతలకు అత్యంత ప్రమాదకరం అని టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య అన్నారు. మండలంలోని ధేనువకొండలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో రామకోటయ్య మాట్లాడుతూ వైసీపీ తెచ్చిన భూ భక్షక చట్టం వల్ల రైతులు ఆస్తులపై హక్కులను కోల్పోతారన్నారు. ఎదైనా సమస్య వస్తే అధికారుల చుట్టూ తిరగడం తప్ప పరిష్కారమయ్యే అవకాశం ఉండదన్నారు. స్థానిక, జిల్లా కోర్టులను ఆశ్రయించే అవకాశమే ఉండదని, హైకోర్టుకు మాత్రమే వెళ్లే అవకాశముందన్నారు. ఇలాంటి కుట్రలకు రూపకల్పన చేసిన జగన్‌రెడ్డిని ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి రాగానే ల్యాండ్ టైటిల్ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. 13న జరిగే ఎన్నికలలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటిని, ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రాజకీయ ఉపాధి కూలీలకు విరామం

ముగిసిన ఎన్నికల ప్రచారం

చీరాల, మే 11 : సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. చెవులు దిబ్బలు పడేలా అభ్యర్థుల పేర్లు, గుర్తులతో హోరెత్తిరించిన మైకులు మూగబోయాయి. ఎన్నికలలో భాగంగా గత నెలన్నరగా సందర్భానుసారంగా రాజకీయ ప్రచార సభలకు, సమావేశాలకు, ర్యాలీలలో జనసమీకరణకు రాజకీయ ఉపాధి కూలీలకు రోజువారీ రూ.300 ఆపైన గిట్టుబాటు అయింది. శనివారం ఎన్నికల ప్రచారం ముగియడంతో వారిలో కొందరికి విరామం, మరికొందరికి ముగింపు పలికారు. ఆది, సోమవారాలు రెండు రోజులు ప్రత్యేక కార్యాచరణకు నమ్మకస్తులు కొందరికి మాత్రం ప్రత్యేక ప్యాకేజీతో కొన్ని బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఇక ద్వితీయశ్రేణి నాయకులలో కొందరు హడావుడి పెంచారు. అక్కడ 50 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 100 ఓట్లు ఉన్నాయి. వాటిని మన వైపు తిప్పుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ అవసరమని పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులకు, వారి అనుంగ అనుచరులకు మాటల మూటలు చేరవేయడంలో కొందరు ద్వితీయశ్రేణి నాయకులు హడావుడి చేస్తున్నారు. అందులో కొందరు స్వామికార్యంతో పాటు స్వకార్యం నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో అభ్యర్థులు కూడా తాము వెచ్చించే సొమ్ములో కొంత దుర్వినియోగం అయినప్పటికీ సానుకూల ఫలితం సాధించేందుకు వాటిని పెద్దగా పట్టించుకోవటం లేదని విషయం తెలిసిన వారి మధ్య చర్చలో ప్రస్తావనలు వస్తుండడం విశేషమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

మూగబోయిన ప్రచారం

పర్చూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం శనివారంతో ముగిసింది. సాయంత్రం 6 గంటల కల్లా ప్రచారం ముగిసేవిధంగా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో సాయంత్రానికే ప్రచారాన్ని ఆయా పార్టీల ప్రతినిధులు నిలిపివేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మరుసటి రోజు నుంచే ప్రచారం హోరెత్తింది. ఆయా రాజకీయ పార్టీల నేతలు హోరాహోరీగా గ్రామాల్లో ప్రచారాలు సాగించారు. లౌడ్ స్పీకర్ల హోరు మూగబోయింది.

ముగింపు రోజు ముమ్మర ప్రచారం

కొండయ్యకు మద్దతుగా కుమారుడు, మేనల్లుడు హీరో నిఖిల్ ప్రచారం

వేటపాలెం(చీరాల), మే 11 : ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శనివారం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్యకు మద్దతుగా ముమ్మర ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా కొండయ్య కుమారుడు గౌరీఅమర్‌నాథ్, మేనల్లుడు సినీ హీరో నిఖిల్ సిద్ధార్థ తీరప్రాంత గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రం వైసీపీ పాలనలో అన్ని విధాలుగా కుంటుపడిందన్నారు. మరలా రాష్ట్ర భవిష్యత్‌ను గాడిన పెట్టాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఆయన తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తులపై ఓట్లువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. పలు చోట్ల యువత పెద్దసంఖ్యలో హీరో నిఖిల్‌తో కలసి సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. కార్తికేయ సినిమా హీరోరా మామా అంటూ యువకులు ఒకరికొకరు చెప్పుకుంటూ ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాడరేవులో ప్రచారం నిర్వహిస్తున్న సినీహీరో నిఖిల్ సిద్ధార్థ, గౌరీఅమర్‌నాథ్

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య

వేటపాలెం (చీరాల), మే 11 : ఆదరించండి. ఓటుతో ఆశీర్వదించండి. అభివృద్ధిలో ముందుందాం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా ముందుకు సాగుతూ రుణం తీర్చుకుంటా, అందరికీ అండగా ఉంటానని టీడీపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని పూటుకూరిసుబ్బయ్యపాలెంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కొండయ్య మత్స్యకారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెసుకున్నారు. వాటిని ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తానని చెప్పారు. సోమవారం జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీరాల మండలం ఈపురుపాలెంలో శనివారం టీడీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం పోలింగ్ సందర్భంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్యకు, ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఊటుకూరిసుబ్బయ్యపాలెంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న కొండయ్య

దయనీయంగా గ్రామీణ రోడ్లు

- కనీస మరమ్మతులూ కరువు
- ఐదేళ్లుగా వైసీపీ నిర్లక్ష్యం
- ప్రయాణికులకు తప్పని పాట్లు

పర్చూరు, మే 11: పర్చూరు నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో గ్రామీణ రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎక్కడ చూసినా గుంతలు, కంకరలేచి ప్రమాదకరంగా ఉన్న దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాలో నిత్యం రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. రాత్రిపూట పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఏళ్ల తరబడి రహదారులు అధ్వానంగా మారినా కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం వైసీపీ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమం పేరుతో మమ అనిపిస్తుందే తప్ప ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న బోడవాడ - రమణాయపాలెం రహదారి



దారుణంగా ఉన్న గొల్లపూడి - భూషాయపాలెం మధ్య రహదారి

చింతపల్లిపాడులో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య వాగ్వివాదం

- ఎంపీ నందిగం సురేష్ వాహనం వస్తుండగా ఘటన
- ఎంపీ, యడం బాలాజీ, ఎమ్మెల్సీ తూమాటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- సంయమనం పాటించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

యద్దనపూడి, (మార్టూరు) మే 11 : యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం తెలుగుదేశం, వైసీపీ పార్టీ కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ సమయంలో ఎంపీ నందిగం సురేష్ ప్రత్యక్షంగా వివాదం జరిగిన ప్రదేశంలోనే ఉండడం విశేషం. అందిన సమాచారం మేరకు చింతపల్లిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తలు గ్రామంలో ద్విచక్రవాహనాలపై ర్యాలీగా ప్రచారం చేసుకొని యనమదల గ్రామం వైపు వెళుతున్నారు. అదే సమయంలో ఎంపీ నందిగం సురేష్ తన వాహనంలో యనమదల గ్రామం వైపు నుంచి చింత పల్లిపాడు గ్రామానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ వాహనానికి ఎదురుగా టీడీపీ కార్యకర్తల బైక్‌ల ప్రచారర్యాలీ రావడం, దాంతో అక్కడ కొంచెం ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ సమయంలో ఎంపీ సురేష్ కారు నుంచి దిగి టీడీపీ కార్యకర్తలను దుర్భాషలాడినట్లు తెలిసింది. అయితే టీడీపీకి చెందిన కొందరు నాయకులు పార్టీ కార్యకర్తలకు నచ్చ చెప్పి, ఎలాంటి గొడవలకు తావివ్వకూడదనే కారణంతో అక్కడ నుంచి ర్యాలీని యనమదల గ్రామానికి తీసుకు వెళ్లినట్లు తెలిసింది. తర్వాత ఈ విషయమై సమీపంలోని గ్రామం నుంచి కొంతమంది వైసీపీ కార్యకర్తలు నందిగం సురేష్ వద్దకు వచ్చారు. అనంతరం మళ్లీ టీడీపీ కార్యకర్తలకు, వైసీపీకి చెందిన కార్యకర్తలకు ఎంపీ సమక్షంలోనే కొంత వాదన జరిగినట్లు తెలిసింది. తర్వాత తెలుగుదేశం పార్టీ ర్యాలీ యనమదల గ్రామానికి వెళ్లిపోగా పార్టీ కార్యకర్తలతో రోడ్డుపై ధర్నా చేయడానికి వైసీపీ కార్యకర్తలు ప్రయత్నిం చినట్లు తెలిసింది. ఈ సంఘటనపై వెంటనే సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి యద్దనపూడి పోలీసులు రోడ్డుపై ధర్నా చేయవద్దని అవసరమైతే స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని ఎంపీతో పాటు కార్యకర్తలకు చెప్పడంతో వారంతా స్టేషన్‌కు చేరారు. అప్పటికి సమాచారం అందడంతో వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కూడా స్టేషన్‌కు వచ్చారు. వారు సీఐ సీతారామ్, ఎస్ఐ జీవీఎస్ చౌదరితో మాట్లాడారు. తరువాత చింతపల్లిపాడు గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన అట్లూరి మహేష్ కొంతమంది తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తులపై కుల దూషణ తో దౌర్జన్యం చేశారని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తరువాత ఎంపీతో పాటు అందరూ వెళ్లిపోయారు. మొత్తం మీద ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. చింతపల్లిపాడులో రాత్రికి పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు సీఐ సీతారాం తెలిపారు.

ఓటు కోసం సొంత ఊళ్లకు ప్రజలు

కిక్కిరిసిన రైల్వే స్టేషన్, బస్టాండ్

చీరాలటౌన్, మే 11 : ఎట్టకేలకు ఎన్నికల ఘట్టానికి చేరుకున్నాం. మూడు రోజుల నుంచి చీరాల బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిసి కన్పిస్తున్నాయి. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారే కాకుండా ఇతర రాష్ట్రాల్లో ఉండే యువతీ, యువకులు, మహిళలు, పురుషులు పిల్లాపాపలతో ఓట్లు వేసేందుకు సొంత ఊళ్లకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. దీంతో ఒకింత రద్దీ పెరిగిందనే చెప్పాలి. ఇదిలావుంటే తరలిన ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో గత ఎన్నికలకంటే ఈసారి ఓటు వినియోగ శాతం పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుడా అధికారులు ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో బీఎల్‌వోల ద్వారా ఓటు స్లిప్‌లను పంపిణీ చేశారు. అయితే ఊళ్లకు చేరుకున్న ఓటర్లు ఆయా ప్రాంతాల్లోని స్థానిక సమస్యలపై ముచ్చటించుకుంటున్నారు. ఓటు వినియోగంపై క్లారిటీ తెచ్చుకునేందుకు పెద్ద ఎత్తున చర్చిస్తున్నారు.



రైలు దిగి బయటకు వస్తున్న ప్రయాణికులు